## పద్మావతీగంగాధర్


అప్పుడే చర్చిగడియారం రెండు గంటలు కొట్టింది. కిఱ్ఱుమని తలుపుతీసిన శబ్దం వినిపించింది. చలిగాలి జోరున వీస్తూంది. శిధిలావస్థలోనున్న ఆ యింటిలో నిద్ర పట్టలేదు. లేచి ఎవ్వరోనని చూడటానికి కూడ చాల నీరసంగా వున్నది. అయినా యింకెవ్వరు, అర్ధరాత్రి యింటికొచ్చేది? రాముకది మామూలే. తప్పత్రాగి, తందనాలాడి, అర్ధరాత్రి యింటికి రావటం, మూలనున్న కుక్కి మంచంలోపడి గుఱ్ఱుపెడుతూ, గొడ్డులా నిద్రపోవటమో, లేక నా ప్రక్కనచేరి, తన అశక్తిని గూర్చి, అసహాయతను గూర్చి, ఎంతో బాధపడుతూ, ఒకొకసారి కన్నీరుపెడుతూ నన్ను లాలించటమో చేస్తుండేవాడు.

నేను మేల్కొనేవున్నాను. అతని కొరకు ఎదురు చూస్తున్నా. కాని ఆరోజు, రాము తిన్నగా యింట్లోనికివొచ్చి, ఏదో వెదకటం మొదలుపెట్టాడు. శబ్దంకాకుండా ఉండాలని ఎంతో ప్రయత్నిస్తున్నాడు. ఒకసారి పెన్నో, ఏదో క్రింద పడింది. ఆ తరువాత డ్రాయరు వూడివచ్చి క్రిందపడి పెద్ద శబ్దమయ్యింది. నే నేమీ ఎరుగనట్లు కదలకుండా పడుకొనే వున్నా.

ఆ తరువాత మరొక వ్యక్తి చాల విసురుగా యింట్లోనికి పరుగెత్తుకొచ్చాడు. బైటకు వెళుతున్న రాము చేతిని పట్టుకొన్నాడు.

"ఏయ్ చేయి వదులు..."

"నా డబ్బు...నాకివ్వు..."





''ఏం డబ్బు...నేనేమీ ఎరుగను..''

''అబద్ధం...ఏమీఎరుగవూ......? నేను లోపలకు వెళ్ళినప్పుడు అక్కడి పెట్టిలోని...100 రూపాయలు...పది, పది రూపాయలనోట్లు ... తీసు కొ ని పరుగెత్తుకొని రాలేదూ?...''

''నేనా ... నీ డబ్బా ... నా కే మీ తెలియదు...''

''ఆ!...నేను చూడలేదనుకొన్నావా? ...అక్కడి నుండి నిన్ను వెంబడిస్తూనే వున్నా...యిస్తావా లేక పోలీసు రిపోర్టు యివ్వమంటావా?...''

''నేనేమీ ఎరుగను...నాకేమీ తెలియదు...నన్నొదులు ముందు...''

''నేనొదలను ... నీకు అప్పుయిస్తున్నందుకు నీవు చేసే మేలు యిదేనా?... సిగ్గులేదూ?...200 రూపాయలు అప్పు పడ్డావు...ఇవ్వాళ అడిగితే రేపంటావు. రేపడిగితే ఎల్లుండంటావు...మనిషికొక మాట, గొడ్డుకొక దెబ్బ...పోనీ లెమ్మని యింతవరకు ఓపిక పట్టాను తిన్న యింటికే కన్నం వేస్తావా? ... డబ్బు యిస్తావా...పోలీసులకు అప్ప జెప్ప మంటావా?...''

''ఏయ్...చేయి వదులుతావా లేదా. . లేకపోతే చూడు...'' అని రాము చిన్న కత్తినొకదానిని తీసాడు.

నాకు భయమేసింది. అంతకుముందు వెదికింది దానికొరకేనని అప్పుడు తెలిసింది. ఇద్దరూ ఆవేశపడుతున్నారు. రాము బాగా తాగివున్నాడు, అక్కడ నుండి వెళ్ళిపోవటానికి తొందరపడుతున్నాడు. రెండవ వ్యక్తి నల్లగా, భీకరంగా వున్నాడు.అప్పు ఎలావున్నా ఎలాగోలా, పోయిన డబ్బు రాబట్టుకోవాలనే తొంద రలో వున్నాడు. అలాంటి మనిషికూడా కత్తి చూసేటప్పటికి వొణికి పోయాడు. వళ్ళంతా చెమటలు పోసాయి. కాని రాము చేయిమట్టుకు వొదలలేదు. వ్యవహారం చేయిమించి పోయేటట్లుగా వుంది.

నేను ఇద్దరి మధ్యా వెళ్ళి నిలబడ్డాను, రాముతో మాట్లాడి లాభంలేదు. అతను స్వాభావికంగానే ఎక్కువగా మాట్లాడడు. నవ్వటంగాని, వినీ విననట్లు, తనకు పట్టనట్లు, తనకు సంబంధంలేనట్లు, వెళ్ళటంగాని చేస్తూంటాడు.

నేను, రాము చేతిని దుకాణదారుని చేతినుండి విడిపించాను. వెంటనే అతడు అక్కడ నుండి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్న అతనిని, దుకాణపుదారు వెంబడించ ప్రయత్నిస్తుండగా, నేను అడ్డువెళ్ళి అతని చేతిని పట్టుకున్నాను.

''కొంచం ఆగండి...అసలు విషయమేమిటో చెప్పండి...''

''అతను నీ భర్తా ?'' నన్ను తేరిపార జూచి ''మీ యిద్దరిలో ఎంత తేడా వుంది ?...'' అన్నాడు.

''విషయమేమిటో చెప్పండి...నేను చేయగల్గింది చేస్తాను...''

''మీ ముఖం చూస్తుంటే నాకేమీ చెప్పబుద్ధి కావటంలేదు...కాని...''

''ఫర్వాలేదు...చెప్పండి...''

''ఏమి చెప్పమంటావమ్మా? నీభర్త మా దుకాణంలో ఎప్పుడూ సారా త్రాగటానికి వస్తాడు. దాదాపు ప్రతిరోజూ వస్తూంటాడు. మొదటిరోజున వచ్చి సారా త్రాగి వెళ్ళుతూ, వెళ్ళుతూ 10 రూపాయల నోటిచ్చాడు. కొంచం చిల్లర యివ్వవలసి వచ్చింది. నేను చిల్లర ఇవ్వబోతుండగా, ఫర్వాలేదు.. వుంచండి ...వస్తుంటాగా...మరల రావద్దనా?'' ...అంటూ ఏదోగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. మత్తులో వున్నాడు కదా అని, నేను నవ్వుకొని ఊరుకొన్నాను.

అలాంటి వ్యక్తిని చూడటం నాకదే మొదటిసారి. నే నాశ్చర్యపోయాను. నాకు అదొక రకమైన సదభిప్రాయమే ఏర్పడింది. తరువాత, అతని పేరూ ప్రఖ్యాతులను గూర్చి తెలుసుకొన్నాను. దాదాపు అక్కడకు వచ్చినప్పుడల్లా, ఒక మూల కూర్చొని త్రాగుతూ, పుస్తకాలు చదువుతుండటమో...వ్రాస్తుండటమో చేస్తుండేవాడు. ఒకొకసారి రోజంతా... మా షాపు మూసివేసేవరకూ అక్కడనే కూర్చొని వుండేవాడు. ఒక్కొక్కసారి, ఒక స్త్రీతో కూడా వస్తుండేవాడు. వాళ్ళిద్దరూ తప్ప త్రాగేవారు. ఆమే డబ్బులిస్తుండేది.అతనిని విడిచి ఉండలేనట్లుగా, ఆ అమ్మాయి అతనితో వుండేది. ఒకరేమిటి, అనేకమంది అమ్మాయిలు నితో అలా ఉండటం నేను చూసా అతనిలో ఏమి ఆకర్షణ వుందో.?

అయితే ఎంత త్రాగినా, తక్కి వారిలా గల్లంతు మట్టుకు చేసేవాడుగా డబ్బుంటే యిచ్చి వెళ్ళేవాడు లేకుం మాట్లాడకుండా వెళ్ళిపోయేవాడ నేనెప్పుడూ అతనిని డబ్బుకొర యిబ్బంది పెట్టలేదు. అతనిని గూ ఎన్నో చెడువిషయాలు విన్నాను. కా అతనంటే నాకెప్పుడూ సదభిప్రాం ముండేది.

కొన్నాళ్లకు మా షాపులో పని చే ఒక అమ్మాయికీ అతనికి సంబంధ ఏర్పడిందని కూడ విన్నాను. తరువా ఆ పిల్ల గర్భవతి అవటంవల్ల, పనిలో నుండి తీసివేయవల్సి వచ్చింది. ఆ పిల్ల పెళ్ళిగాని పిల్ల. అప్పటికీ అతనిపై నాకెలాంటి చెడు ఉద్దేశ్యమూ కలుగలేదు. అది అతని తప్పు అనటం న్యాయంగాదు. అతనిలో అలా ఆకర్షించగల శక్తివుంది. ఏమీ పట్టీపట్టనట్లు, నిర్లక్ష్యంగా, విచారంగావుండే, అతని వింత ప్రవర్తన వాళ్ళనందరిని పిచ్చి వాళ్ళను చేస్తుండాలి. అతని మంచితనానిని గూర్చి వాళ్ళతో, వీళ్ళతో, వాదించే వాణ్ణి కూడాను.

కాని యీనాడు యీ పని చేసాడు. నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. అక్కడివాళ్ళు కూడా చెప్పారు...అది నేను యివ్వవల్సిన వాళ్ళకు యివ్వగా

మిగిలిన లాభం...నాకూ, ఒక్కగా నొక్క కూతురు...తల్లిలేదు...దిక్కూ మొక్కెవ్వరూ లేరు...పండుక్కి గొలుసు చేయించాలనుకొన్నా...దమ్మిడీకి దమ్మిడీ కూడబెట్టుకొస్తున్నా ... నేను లోపలకు వెళ్ళినప్పుడు, పెట్టె సొరుగు తీసి ఆ డబ్బు ఎత్తుకొచ్చాడు...నాదీ ఏమంత పెద్ద వ్యాపారం గాదు...అదే మంటే కత్తి చూపించాడు. అంత సాధు వుగా కన్పించే వ్యక్తిలో అంత క్రూర త్వమా !...నీ వే చెప్పమ్మా ?...నీ భర్తకు దొంగతనం అంటగట్టటం కాదు, నేను కళ్ళారా చూసాను...,'' అంటూ ఎంతో బాధగా, తన బ్రతుకును గూర్చి, రాము చేసిన పనిని గూర్చి, తన దుర దృష్టాన్ని గురించి చెప్పాడు.

రాము అలాంటి పనిచేసాడంటే నేను నమ్మలేదు. తనంటే అంత గౌరవం, ఆదరం చూపించే వ్యక్తికి రాము అలాంటి అపకారం చేసాడంటే నేను నమ్మలేదు. కాని దుకాణదారు మాటలు వింటూంటే, అతను చెప్పేది కూడ నిజమేనేమో ననిపించింది త్రాగిన మైకంలో, రాము రూపాయిలు దొంగి లించి వుండవచ్చు. మైకం వదలిన తరు వాత కూడ, తనతప్పుని వొప్పుకొన టానికీ, యితరుల దృష్టిలో దొంగగా పరిగణింపబడటానికీ, అతని మన సొప్పకపోయివుండవచ్చు. తన మంచి తనం పోతుందని భయపడుండవచ్చు. రాము దొంగో కాదో, దుకాణపుదారు చెప్పేది నిజమో, అబద్ధమో ఆలోచించ గలశక్తి, ఓపిక, ప్రశాంతత, నాలో అప్పుడు లేవు. అతనిని చూస్తుంటే నాకు జాలివేసింది. పాపం ఎన్నాళ్ళు కష్ట పడ్డాడో ఆ డబ్బు కూడబెట్టటానికి.

నేను పండుగ ఖర్చులకని దాచుకొన్న డబ్బుయిచ్చివేసాను. అతని దుకాణంలో, కనీసం బాకీ తీరేవరకైనా ఉద్యోగం యివ్వమని అడిగాను. ఎలాగైతే అతనిని ఒప్పించగల్గాను.నా నిజాయితీకి ఆశ్చర్య పోతూ, రాములాంటి నిలకడ లేని వ్యక్తికి భార్యనైనందుకు విచారిస్తూ, నా మంచితనాన్ని, అందాన్ని కొని యాడుతూ వెళ్ళిపోయాడు.

అతనిని వదిలించుకొనేటప్పటికి, తెల్లవారుజాము నాల్గుగంటలైంది. వేళకి తిండిలేకపోవటంవల్లా, మానసికంగా బాగుండకపోవటంవల్లా సరిగా నిద్రపట్టక పోవటంతో తలంతా బరువుగా వుంది. వంట్లో చాలా నీరసంగా వుంది. నిద్ర పట్టలేదు. మనస్సు పరిపరి విధాల పోయింది ఏమి చేయాలి ? ఏమిటీ బ్రతుకు?... నాది కూడ ఒక బ్రతు కేనా ... ?

నాకు వెనుకటి రోజులు జ్ఞాపకం వొచ్చినై. ఆ రోజుల్లో అమ్మను ఒక జమిందారు పోషిస్తూ ఉండేవాడు, జీవితం వైభవంగా సాగుతుండేది. లేక, లేక చాలా కాలానికి నేను పుట్టాను.

నా పెంపకం విషయంలో, చదువు సంధ్యల విషయంలో, ఎంతో శ్రద్ధతీసుకొన్నారు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టారు. నేను ఆడింది ఆట, పాడింది పాటగా ఉండేది. స్కూలు చదువు పూర్తిచేసి కాలేజీలో చేరాను.

అవి భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చిన రోజులు. ఆ తరువాత, జమిందారులకు నష్టపరిహారమిచ్చి, వాళ్ళ ఆస్తి పాస్తులు ప్రభుత్వం తీసుకొనటంతో జమిందారులతో పాటు మా కుటుంబాల వంటి కుటుంబాల బ్రతుకులో కూడ మార్పు వచ్చింది. మా అమ్మను పోషిస్తుండే జమిందారుగారు, కోరలు పీకిన పామయ్యారు. పూర్వం ఎన్నో అప్పులు చేసారు, జమిందారు హోదాలో, ఏంతో గుంభనగా కాలం గడపుకొంటూ వచ్చారు. జమిందారీలు పోవటం, అప్పులవాళ్ళు వెంటబడటం, ప్రభుత్వం యిచ్చిన డబ్బు అప్పుల వాళ్ళకు చెల్లించటం జరిగింది అన్నాళ్ళూ మమ్ములను వాళ్ళు చూసారు. ఆ తరువాత మా అమ్మవంతు వచ్చింది.

ఆయన భార్య ఏనాడో పోయింది. బాగున్న రోజుల్లో ఆయన మోచేతి నీళ్ళు త్రాగిన వాళ్ళంతా, ఎండిన చెరువు లోని కప్పలలా, డబ్బుతోపాటు జారుకొన్నారు. ఉన్న డబ్బు కాస్తా అయిపోయింది. జమిందారుగారు ఒక నాటి రాత్రి రక్తపుపోటు వచ్చి శాశ్వితంగా కన్ను మూసారు. ఇక నేనూ, అమ్మా, యిల్లూ, కొద్దిగా నగలతో మిగిలాము. ఒకొక్క నగ అమ్ముకొని కాలం గడపటం సాగించాము. నాకోసమని, వాళ్ళూ వీళ్ళూ మా యింటికి వస్తూ పోతూవుండటం, వాళ్ళకు అమ్మ ఎంతో హుందాగా చెప్పి పంపించటం, వాళ్ళువెళ్ళిన తరువాత చాటుగా అమ్మ ఏడుస్తుండటం — అన్నీ, అమ్మ నోరువిప్పి చెప్పకపోయినా నాకు తెలుసు. నేనేమీ పసిదాననుగాదు. నేను యింటరు ప్యాసయ్యాను. నాకు యింకా చదువుకోవాలనుండేది అమ్మకూ చదివించాలని వుండేది. కాని కంచెలేని బ్రతుకయింది మాది. చదువు మానివేసాను.

అమ్మ, తాను బ్రతికుండగానే, నాకు పెళ్ళిచేయాలని తాపత్రయ పడింది. అటు డబ్బు బాధ, యిటు నా పెళ్ళి బాధతో ఆమె ఆరోగ్యం కూడా చెడిపోయింది. ఒకనాడు నన్ను ఏకాకిగా వదలివెళ్ళింది. ఆనాటి నా బాధ, ఆ భగవంతునికే తెలియాలి. నాకు నేనే మిగిలాను. చదువుకొనటంవల్ల, ఒకనాడు గౌరవంగా నల్గురితో తిరగటంవల్ల, యీ సమాజంలో నాకెలాంటి స్థానముందో తెల్సుకొనగల్గాను. నన్ను ప్రతివారు ఏ దృష్టితో చూస్తారో నాకు తెలియకపోలేదు. ఇల్లు అమ్మి, మరొక పేటలో ఒక చిన్నయిల్లు కొనుక్కొని, మకాం మార్చాను. ఆ నాడు నేను పెరిగిన వాతావరణానికి, యీ నాడు నేనున్న వాతావరణానికి ఎంత తేడా!

కొత్త వాతావరణానికి అనుగుణంగా మసలుకొనటం నేర్చుకొన్నాను. ఆ రోజులలోనే రాముని కల్సుకొనటం జరిగింది. నాకింకా యిప్పటికీ బాగా గుర్తే. అతనిని కల్సుకొనటం కూడ చాల గమ్మత్తుగానే జరిగింది. నా అదృష్టం యిలా వుండే, ఆనాడు అలా జరిగిందేమో!

నేను కాలేజీలో చదివే రోజుల్లో, మా కాలేజీ గరల్సు కొందరకు, రాము హీరో. అతని పుస్తకాలు, కథలు, పదేసిసార్లు చదివామన్నా ఆశ్చర్యపడ వల్సిన అవుసరంలేదు తీరిక సమయాలలో అతని నాయిక, నాయకులను గూర్చి చర్చించుకుంటూ వుండేవాళ్ళం. అతని పుస్తకాలన్నా, అతనన్నా మాకంత పిచ్చి వుండేది. మా కాలేజీ భాషా సమితి మీటింగు వస్తేసరి, అతనిని ఆహ్వానించటానికి ఏకగ్రీవంగా ఆమోదించేవాళ్ళం.

ఒకొక్కసారి అతని పత్తా దొరికేది గాదు. ఒకొక్కసారి వస్తానని మానుకొనే వాడు. అతను వస్తాడని ఒకరికొకరం తెలియకుండా ముస్తాబై వచ్చి వినాయకుడి బొడ్డులో వ్రేలుపెట్టినట్లు, అతను రాక పోవటంతో నిరుత్సాహపడ్డ సమయాలనేకమున్నాయి. ఒకే ఒకసారి అతను వచ్చాడు. అంతే. మరల మా ప్రిన్సిపాల్ అతనిని ఆహ్వానించటానికి ఒప్పుకోలేదు. కాదు కూడదంటే అసలు భాషా సమితినే రద్దుచేస్తానన్నది. మేమంతా ఆ రోజుల్లో చాటుగా పెరుగుతున్నవాళ్ళం. మనస్సులోనే అతని స్నేహానికి, పొందుకు, తహ తహలాడుతూ, ఊహలతో, కోరికలతో కలలుకంటూ వుండేవాళ్ళం. అప్పుడప్పుడు మేమంతా కూర్చొని, పిచ్చాపాటి, పెళ్ళి విషయాలు మాట్లాడుకొనేటప్పుడు "అలాంటి భర్త దొరికితే ఎంత బాగుంటుంది...అంతకన్నా స్త్రీ ఆశించవల్సిన దేముంటుంది?..." అంటూ, ఏమిటేమిటో, అసందర్భ విషయాలుకూడ కొందరమ్మాయిలు అంటుండేవారు. అలా కలలుగంటుండగానే పరీక్షలైనాయి. అంతా విడిపోయాము. ఎవరెవరెచ్చట వున్నారో!...ఎందరికి వివాహమయ్యిందో!..ఎలాంటిభర్తలు దొరికారో! ఎంతమంది కలలు నిజమయ్యాయో! ఎలా వైవాహిక జీవితాన్ని గడుపుతున్నారో! తలుచుకుంటే జీవితం చాల ఆశ్చర్యంగా వుంటుంది.

ఆనాటి స్నేహితురాళ్ళు పొందలేని పురుషుణ్ణి నేను పొందాను. ఆనాటి ఊహానాయకుడు, యీనాడు నా ప్రియుడు. వాళ్ళకు తెలిస్తే ఏమనుకుంటారో! ఎంతబాధ పడతారో! ఎలా నా అదృష్టాన్ని కొనియాడుతారో! ఎలా యీర్ష్యపడతారో!

ఒకనాటి సాయంకాలం నేనెక్కడకో ప్రయాణమై, బస్సుస్టాండులో నిల్చొన్నాను. అక్కడ ఎవ్వరూలేరు. కొద్ది సేపట్లోనే ఒకవ్యక్తి వచ్చాడు. ఎక్కడో

చూచినట్లు గుర్తు— అతనే రాము. చిక్కిశల్యమైపోయాడు-మాసిపోయిన గుడ్డలు. మనిషిని చూస్తే, నాకేమిటో విరక్తి చెందిన వ్యక్తిలా కన్పించాడు. బాధపడ్డాను. అతనితో మాట్లాడాలని హృదయం తహతహలాడింది. ముచ్చెమటలు పోసాయి. ఎన్నాళ్ళనుందో! అణగి మణగివున్న కోర్కె నన్నొక పిచ్చిదానినిగా జేసింది. వెంటనే వెళ్ళి "మీరు — రాముగదూ — ?" అని అడిగాను, ఎంతో ధైర్యంచేసి. అంతా మైకంలో తేలియాడుతున్న వ్యక్తిలా ప్రవర్తించాను. అతనూ సహజమైన చిరునవ్వుతో—

"అవును ... మీరు ... మిమ్మల్ని ఎక్కడో చూచినట్లు గుర్తు ..." అన్నాడు.

"పోయిన సంవత్సరం మా కాలేజీ భాషా సమితి సమావేశానికి మీరు వచ్చారు...అప్పుడు నే నాసమితి కార్యదర్శినిని..." అన్నా ఎంతో ఉత్సాహంగా.

"నాకు కొంచం మతి మరపు... మీరేమీ వేరుగా తలచకపోతే..."

"దానికేముందండి ... మర్చిపోవటం సహజమేగా...నాపేరు సుశీల, అందరూ 'సుశీ' అంటారు" అని చెప్పాను పట్టలేని ఆనందంతో.

అతరువాత చాల సేపు యిద్దరం బస్సుకొరకు ఎదురు చూస్తూ నిల్చున్నాము. అదృష్టంకొద్దీ బస్సు రాలేదు.



"నిత్య యవ్వనుడిగ ఉండాలంటే ఏం చెయ్యాలి స్వామి?"
"అంతరిక్షంలో స్థిరనివాసం ఏర్పరుచుకో నాయనా!"

రాము చాల విసుగుగా వున్నాడు. బస్సునూ, ప్రభుత్వాన్నీ తిడుతూ, "మీ కభ్యంతరం లేకపోతే, ప్రక్క హోటలుకు వెళ్ళి కాఫీ తాగుదాము. ప్రభుత్వానికి కనికరం లేనట్లు, బస్సుకూడా మనమీద సమ్మెచేసింది..." అంటూ ఎంతో కలుపుగోలుతనంగా అడిగాడు. నేనెలా ప్రవర్తించగల్గానో, ఎలా మాట్లాడగల్గానో చెప్పటం కష్టం నా సంతోషానికి పట్టపగ్గాలు లేవు. వెదుకబోయిన తీగె ఎదురైనట్లయింది.

ఆ క్షణం నా జీవితంలో మరుపురానిది. ఆనాడు నేనుచేసిన పనికి యీనాడు విచారించటంలేదు. ఒక్కొక్క క్షణం మానవ జీవితాన్ని ఎలా మార్చ

గల్గుతుందో తలపుకొచ్చినప్పుడల్లా వొళ్లు జలదరిస్తుంది.

మూగదానిలా అతనిని అనుసరించాను. త్రాగింది చెరొకకప్పు కాఫీ చాలసేపు అక్కడ కూర్చొని, చిరకాల పరిచితులమైనట్లు, అనుకోకుండా, అకస్మాత్తుగా కల్సుకొన్నట్లు, పిచ్చా పాటి మాట్లాడుతూ కూర్చొన్నాము. అతని రచనలను గూర్చి అడిగినప్పుడు ఎక్కువగా ఏమీ చెప్పేవాడుగాదు. చాల నమ్రతగా సమాధాన మిచ్చేవాడు. అంతా ఏమిటో !!

బాగా చీకటి పడింది. "నీవు ఉండే దెక్కడ?...బాగా చీకటి పడింది..." అన్నాడు.

"ఇక్కడకు కొంచం దగ్గరలోనే... మీ రెక్కడుంటున్నారు?..." అని అడిగాను.

"ఎక్కడ జానెడుచోటు దొరికితే అక్కడే..."

అలాగైతే, యీ పూట మా యింటికి రాకూడదూ ?... భోజనం కూడ చేయవచ్చు..."

"మీ వాళ్ళు ఏమీ అనుకోరూ...?"

"నాకెవ్వరూలేరు...బహుశ, మీవాళ్లే మీకొరకు ఎదురు చూస్తుంటారేమో. ."

"నా వాళ్ళా...అబ్బే!!..." అన్నాడు అదొకరకంగా నవ్వుతూ..."

ఇంటికొచ్చాము వంట చేసాను. ఇద్దరం కూర్చొని భోజనం చేసాము.

చాలకాలానికి హాయిగా భోజనం చేసినందుకు,ఎంతో యిదిగా మాట్లాడాడు. "మీ చేతి వంట ఎంత రుచిగా ఉందండి" అంటూ పొగిడాడు.

అతను నిష్కల్మషంగా, ఆనందావేశాలతో కబుర్లు చెబుతుంటే వినటం నాకు చాల యిష్టం. చాల విషయాలలో రాము పసిపిల్లవాడికన్నా కనాకష్ట మనిపిస్తుంది.

తరువాత "నాకు బైటకెళ్ళవల్సిన పనుంది. పొద్దు పోయిన తరువాత, నీ కభ్యంతరం లేకపోతే వచ్చి ఇక్కడే పడుకుంటా ..." అన్నాడు ఎంతో సౌమ్యంగా.

"అలాగే చేయండి..." అన్నాను అప్రయత్నంగా.

ఆలోచనలేని పని చేసానేమోనని మనస్సు పరిపరివిధాల పోయింది.

బాగా ప్రొద్దుపోయింది. అతను వస్తాడేమోనని ఎదురుచూస్తూ కూర్చున్నాను. ఎప్పుడు కన్నుమూసానో నాకే తెలియదు. మాగన్నుగా నిద్రపట్టింది. ఎవ్వరిదో చేయి తగిలినట్లయింది. కళ్ళు తెరచి చూసాను. రాము నా ప్రక్క పరున్నాడు. అతని స్పర్శ నాలో మధురానుభూతులను మేల్కొల్పింది. మౌనంగానే అతని కౌగిలిలో కలసి యిమిడి పోయాను.

చర్చి గడియారం 2 గంటలు కొట్టింది.

ఆనాటినుండి రాము నా వాడు...కాదు, కాదు. నేను రాము దానను. అతను నాకు

తాళికట్టిన భర్తగాడు. కానీ తను నా భర్త. నా సర్వస్వం. లోకం దృష్టిలో రాము ప్రక్క నా కెలాంటి స్థానమున్నదో ? అయినా ఎవ్వరి ఆనందం వారిది. ఆనాటి నుండి, యీనాటి వరకూ రాము యిష్ట మొచ్చినప్పుడల్లా వచ్చి పోతుంటాడు. ఈ యిల్లు అతనిది. నే నతని సొత్తు. ఈ ఇంట్లోనే, ఆ డ్రాయరు ముందు కూర్చునే, ప్రఖ్యాతి పొందిన నవలలు, కథలు ఎన్నో వ్రాశాడు. మా జీవితం ఛాయా రూపంగా వాటిల్లో కన్పిస్తుంది. ఎవరి చేతిలో ఆ పుస్తకాలు చూచినా నా కెంతో గర్వంగా ఉంటుంది.

కాని ఆర్థిక బాధలు ఎక్కువైనాయి. కాలం గడవటం కష్టమైపోయింది. అతని కథ పడితే,వారపత్రికలు, మాసపత్రికలు, కొన్ని వందలు ఎక్కువగా అమ్ముడు పోతాయి. కాని యీ నాటికీ కథకు పది రూపాయలు, మహాయిస్తే పదిహేను రూపాయలకన్నా ఎక్కువ ఇవ్వరు అది కూడ వాళ్ళ దయ.రాము ఎప్పుడూ వెళ్లి, వాళ్ళ నడుగడు. పుస్తకాల విషయం కూడ అంతే. నాకు తెలుసు, కొన్ని పుస్తకాలు వేలకు వేలుగా అమ్ముడు పోయినాయి. ఎవరి చేతిలో చూచినా అతని పుస్తకాలే వుండేవి. అనేకసార్లు, ఎంతో గొప్పగా, అనేకమంది ఆ పుస్తకాలను గూర్చి మాట్లాడుకొనటం విన్నాను. ప్రచురణాధికారి ఎప్పుడు చూచినా "ప్రథమ ముద్రణ వెయ్యి కాపీలు" అనే అంటాడు. నిజా నిజాలందరికీ తెలుసు. నే ననేకసార్లు, వాళ్ళ దగ్గరకు వెళ్ళి, డబ్బు విషయం మాట్లాడమని రాముకు చెప్పాను. ఊకొట్టి వూరుకునే వాడు. ఇచ్చే కొద్దిడబ్బుకూడ వాళ్ళు సరిగా యిచ్చిన పాపాన పోలేదు. ప్రచురణాధికారి ఎంత సంపాదించాడో చెప్ప నవుసరం లేదు. ఎప్పుడైనా రాముని గట్టిగా మందలిస్తే "ఏమిటి నుశీ...నీకు పిచ్చా...నేను వ్రాయటానికి పుట్టాను... అతడు డబ్బు సంపాదించటానికి పుట్టాడు. వ్రాయకపోతే నాకు పిచ్చి ఎక్కుతుంది.. అతనా వ్యాపారి...ఏమి చేయమంటావు చెప్పు. అతనికి తెలియదూ?...అతనూ మనిషేగా ... అలాంటి వాణ్ణి అడిగి మట్టుకు లాభమేముంది ?...ఒక్క విషయం మట్టుకు నిజం...నాకు చావు లేదు ... అతనీరోజు చస్తే రేపటికే లోకం అతన్ని మర్చిపోతుంది...అది నీ అదృష్టం ... నాతోపాటు నీవూ శాశ్వితంగా వుంటావు ... '' అంటూ నవ్వి వెళ్ళిపోయేవాడు.

చాలకాలం నుండి, మేము కలసి సంసారం చేస్తున్నా, రాము ఎవరో, ఏమిటో నాకు తెలియదు. అతనివిషయాలు నే నడుగనూలేదు. నన్ను గూర్చి అత నెప్పుడూ ప్రశ్నించనూలేదు. అత నొక ఉన్నత కుటుంబంలో పుట్టాడని, అతనిని గూర్చి పుస్తకాలలో, పత్రికలలో వ్రాస్తుంటారు. నాకూ అంతే తెలుసు

అతను మాట్లాడే విధం, నల్గురితో మెలిగే పద్ధతీ, ఆ హుందాతనం చూస్తే అతనూ ఒక జమిందారు కోవకు చెందిన వాడేమోనని అనిపిస్తుంది. అతని తండ్రొక కళాపిపాసకుడై, జమిందారీ లున్నప్పుడు డబ్బు యిష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టివుంటాడనీ, దాని పర్యవసానంగా రాము యిలా బ్రతుక వలసి వచ్చివుంటుందనీ నేను అనుకొంటుంటాను. పూర్వపు వాసనవల్ల మేమిద్దరం అంత తొందర్లో ఒకరికొకరం అంత దగ్గరయ్యామేమో ననిపిస్తుంది.

మాకు పరిచయమై దాదాపు మూడు సంవత్సరాలైంది. ఒకరి వ్యక్తిగత విషయాలలో మరొకరం కల్పించుకొనకుండా జీవితం గడుపుతున్నాము. జీవితం ఒక సత్రంలాంటి దనిపిస్తుంది. మొదటి సంవత్సరంలోనే మా కొక మగపిల్లవాడు పుట్టాడు. సంవత్సరమైనా గడువకముందే వాడు చనిపోయాడు. ఆ పిల్లవాడు చనిపోవడమే మంచిది. వాడంత అనారోగిగా పుట్టటానికి కారణం తండ్రేనని కూడ డాక్టర్లు చెప్పారు.

నేను ఏ విషయాన్ని గూర్చి కూడా బాధపడటంలేదు. రాము నెప్పుడూ తెల్సి నొప్పించలేదు. అస లతని తప్పేముంది? నాపై అత నెప్పుడూ అధికారాన్ని చెలాయించలేదు. దానికి నే నేమీ పెద్దగా సంతోషపడటంలేదు. అతను నాపై అధికారాన్ని చెలాయించాలనీ, నాకు మరీ దగ్గరగా వుండాలనీ అనేక సార్లు కోరుకొంటుంటాను. కాని నోరు తెరచి అడుగలేను. కోపం నటించి శాసించలేను. అతను త్రాగుడు మాని ఆరోగ్యవంతుడవ్వాలని ఎంతగానో ఆరాటపడుతుంటాను. ఒకసారి ఆ ఆరాటాన్ని అణచుకోలేక త్రాగుడు మానమని అడిగాను.

"త్రాగుడు మానటం...సుశిని మరువటం...రెండూ అసాధ్యమైన పనులే ..." అని నవ్వుతూ అన్నాడు.

అంతే. మరెన్నడూ నేను ఆ విషయమే ఎత్తలేదు. ఇంటిలో సామాను ఒక్కొక్కటే అమ్ముకొంటూ కాలం గడుపుతున్నాము. రాము అప్పుడప్పుడూ నాకు చెప్పకుండా టేబిలుపై డబ్బు వదలి వెళ్ళేవాడు. ఇల్లు కూడా తాకట్టు పెట్టవలసి వచ్చింది.

రాముకు దుకాణదారుకు, మధ్య సంఘర్షణ జరిగిన రాత్రి సంఘటనతో నాకు దుకాణంలో ఉద్యోగం దొరికింది. అదొక రకంగా కాలం గడిచిపోతూంది. ప్రొద్దున్నే వెళ్ళి రాత్రి చాల ప్రొద్దుపోయిన తరువాత యింటికి తిరిగి వస్తుండేదాన్ని.

నేను అక్కడచేరిన తరువాత రెండు, మూడుసార్లు రాము రకరకాల స్త్రీలతో వచ్చాడు. అతనూ నన్ను మాట్లాడించలేదు. నేనూ ఏమీ ఎరుగనట్లుగానే ప్రవర్తించ ప్రయత్నించాను కాని మొదట

సారిగా ఆ దృశ్యాల్ని కళ్ళారా చూడటం వల్లనేమో, యీర్ష్యపడటం మొదలు పెట్టాను. చాల బాధగా వుండేది. హృదయం తరుక్కుపోయేది. ఎవరి కోసం యీ బాధంతా? తరువాత నా తెలివితక్కువ తనానికి నాకు నవ్వొచ్చేది. నన్నుగూర్చి నేనే జాలిపడు తుండేదాన్ని.

ఆ దుకాణంలోకి రకరకాల మను ష్యులు వస్తూండేవారు, నాతో సరసంగా మాట్లాడుతుండేవారు. వాళ్ళ తెలివితేట లకు వాళ్ళే నవ్వుకొంటుండేవారు. నన్ను గూర్చి దుకాణపుదారునికూడ అడుగు తుండేవారు. అతను నా గౌరవాన్ని కాపాడుతుండేవాడు. గూటినిబట్టి పిట్ట లను పసికట్టవచ్చు ననుకుంటాను. అక్కడకు చేరేవారంతా అదొకరకం. పొద్దుగూకిన తరువాతనే, ఎక్కువమంది వస్తుండేవారు. పగలంతా కూలినాలిచేసి, రాత్రిళ్ళు, సంపాదించినడబ్బు కాస్తా అక్కడ ఖర్చుపెట్టి వెళ్ళేవారు. పాపం, వాళ్ళ భార్య, బిడ్డలెలా బ్రతుకుతున్నారో! ఆ తల్లులు ఎలా యింటివద్ద కుమిలి పోతుంటారో!

నేను మరొక ప్రపంచాన్ని చూస్తు న్నట్లుగా తలంచేదానను. నాకు వాళ్ళం దర్ని చూస్తుంటే జీవితంమీద రోత పుట్టేది.

ఎందుకు వీళ్ళంతా యీ త్రాగుడుకు యిలా ఖర్చుపెడతారు? దానివల్ల పొందే లాభమేముంది? క్షణంపాటు వాళ్ళను వాళ్ళు మర్చిపోవటమేనా? మానవుడు తనను తానే మోసపుచ్చుకొంటున్నాడు. అది వాళ్ళకుమాత్రం తెలియదూ! తెలియ దనుకొనటం నిజాన్ని కప్పిపుచ్చటమే. అయితే మానవుడు తెలిసే ఎందుకు తప్పు చేస్తున్నాడు?

ఇలాంటి ఆలోచనలతో అప్పుడప్పుడు సతమతమవుతూండే దానను. నా పిచ్చి తనానికి నేనే నవ్వుకొంటుండే దానను.

కాని నాకు మట్టుకు బాగా డబ్బు లిస్తుండేవారు. దుకాణపుదారు ఎంత మంచివా డనుకున్నానో అంత మోస గాడు. మోసగాళ్ళనుకూడ మోసగించే మోసగాడు. నాకు చదువు రాదనుకొని వుంటాడు. లెక్కల క్రింద లెక్కలు వ్రాయటంలో నేర్పరి.

"చాల ప్రొద్దుపోయింది...బైట చాల చలిగాకూడ వుంది ... మా యింట్లోనే పడుకోరాదూ!..మళ్ళీ తెల్లవారి రావాలిగా. మా అమ్మాయికూడ లేదు..."అంటుండే వాడు అప్పుడప్పుడు.

నేను వినీ విననట్లు వూరుకునేదానను.

అతని కళ్ళలో, అతని కోరికలుచూడ నంత తెలివి తక్కువదాన్నేమీ నాదు. అతను పయోముఖ విషకుంభం. ఎవర్ని నమ్మటం!

అప్పుడప్పుడు రాము అస లితని డబ్బు దొంగిలించ లేదేమోనని అనిపి స్తుండేది, అతని ప్రవర్తన చూస్తుంటే.

రాము మంచితనాన్ని ఆసరాగా తీసుకొని, ఎవ్వళ్ళో దొంగిలించి, రాముపై నేరం మోపారేమోనని కూడ అనుకొంటుండే దాన్ని.

ఎవరి తప్పుకు నేను యీ శిక్ష అనుభవిస్తున్నాను? అబ్బ!! జీవితమెంత దుఃఖమయం! సంపాదనకేం? సంపాదన బాగానే వుంది. జీతంగాక, రోజుకు రెండు రూపాయలకు పైగా వచ్చేవి. నిజానికి ఆ డబ్బును చూసి నేనెప్పుడూ మురిసి పోలేదు. ఆ డబ్బు వాళ్ళందరూ ఎలా సంపాదించారో, ఇంటివద్ద, వాళ్ళ పెళ్లాం, బిడ్డలు ఎంత కుమిలిపోతుంటారో గుర్తుకొచ్చినప్పుడల్లా మనస్సు కృంగిపోయేది. అయినా ఏటి కెదురీదటం నాకు సాధ్యంగానిది. ప్రవాహంలో బడి కొట్టుకుపోవటం కన్నా నాలాంటి వాళ్ళు చేయ కల్గింది కూడ ఏమీ లేదనుకొని ఊరట చెందుతుండేదాన్ని.

ఆనాడు పండుగ. దుకాణంలో తీరిక లేదు. వ్యాపారం ఆ రోజున చాల ఎక్కువగా ఉంది.

ఆ రోజున రామును చూడాలనీ, వీలైతే ఆ రాత్రి అతనిని యింటికి తీసుకొని పోయి, అతనితో గడపాలని, నాహృదయం ఎంతగానో ఆరాటపడింది.



కాని నా ఆశ ఫలించే అవకాశం కన్పించలేదు. ప్రొద్దు పోయింది. రాము వచ్చే అవకాశం కన్పించలేదు. ఆమావాస్య కారుచీకటి. ఒంటరిగా నడిచివెళ్లాలి ఎందుకో భయం వేసింది. పది అడుగులు వేసి రోడ్డుమీద కొచ్చాను. ఏదో శబ్దమయ్యింది వెనుకకు తిరిగి చూసాను ఏమీ కన్పించలేదు. మరొక రెండడుగులు వేసాను. నన్ను ఎవరో వెంటడిస్తున్నట్లున్నది. భయంతో వెనుకకు తిరిగి చూసాను. రామేమోననే ఆశ కలుగక పోలేదు. కాని అది రాము నడక గాదు

"భయపడకండి...నేనూ అటువైపుకే వెళ్ళాలి... మిమ్ములను యింటి వద్ద దిగబెట్టి వెళ్ళతాను... చాల చీకటిగా వుంది..." అంటూ తొందరతొందరగ నన్ను కల్సుకొని, నాప్రక్కనే నడవటం మొదలు పెట్టాడు.

"వద్దు" అందామనిపించింది. కాని నోరు పెగలలేదు. భయంతో తొందర తొందరగా నడవటం సాగించాను.

చీకటిలో అతని ముఖాన్ని పోల్చుకోలేకపోయాను. తలెత్తి చూడటానికే భయపడ్డాను. త్రోవలో ఎవ్వరం మాట్లాడలేదు

ఇంటిదగ్గరకు రాగానే "సరే...నేను వెళ్ళి వస్తాను," అని వెళ్ళిపోయాడు.

నేను ఏమీ మాట్లాడలేదు. ఎప్పుడు యింట్లో పడతానా అనే తాపత్రయం తప్ప మరొక ఆలోచన నాకు లేదప్పుడు.

మామూలుగానే, తలుపులు గడి వేయకుండా, రామువస్తాడనే ఆశతో



నీరసంగా మంచంపై వడ్డిగిలాను. ఎప్పుడు నిద్రపట్టిందో నాకేతెలియదు. ఎవ్వరో వచ్చి నాప్రక్కన పరున్నట్టు మాత్రం లీలగా గుర్తుంది. అలసిపోయిన నేను, రామనుకొని, మామూలుగానే అతని కౌగిలిలో యిమిడి పోయాను.

నాకు తెల్లవారి మెలుకువ వచ్చి చూచేటప్పటికి నా రాము నాప్రక్కన లేడు. తెల్లవారిన తరువాత అతనికి చక్కగా కాఫీయిచ్చి, యిష్టపదార్ధాలతో భోజనంపెట్టి, ఎన్నో విషయాలు చెప్పి నాకు దూరమవకుండా చేసుకోవాలని కలలు గన్నాను.

అలా జరుగలేదు. నాల్గురోజుల తరువాత—నాకు వంట్లో బాగాలేదని చెప్పి సాయంకాలమే యింటికి తిరిగి వచ్చాను. రాత్రికి రాము వచ్చాడు. నేను మెలుకువ గానే పడుకొని వున్నాను. తిన్నగావచ్చి మంచంపై నాకాళ్ళవద్ద కూర్చున్నాడు. చాల కొత్త కొత్తగా ప్రవర్తించటం మొదలు పెట్టాడు. నేను నిద్రపోతు న్నట్లు, ఏమీ ఎరుగనట్లుగనే వున్నాను. సాయంకాలంనుండి నాకు మనస్సులో ఏమీ బాగాలేదు. ఎప్పుడూలేనిది, అనేకసార్లు వెక్కి వెక్కి ఏడ్చాను నా వంటరి తనానికి నేనే విచారించాను. చివరకు ఖర్మ అనుకొని దిగమ్రింగి వూరుకొన్నాను.

ఆకస్మాత్తుగా నా కాళ్ళపై రాము కన్నీటి బిందువులు రాలాయి ప్రపంచం గిఱ్ఱున తిరిగినట్టనిపించింది. నేను లేచి కూర్చొని అతని కన్నీళ్ళు తుడిచాను. వెంటనే నారెండుచేతులూ పట్టుకొని "సుశీ ... నన్ను ... క్షమించవూ" అన్నాడు గాద్గదికంగా.

"అదేమిటి రామూ?..పసిపిల్లవాడిలా ...తప్పుగదూ...?" అన్నానునేను అనునయంగా, పొరులుకొస్తున్న దుఃఖాన్ని అణచుకొని

"కాదు సుశీ...నీవు నన్ను క్షమించా ననాలి..."

"క్షమించటమా!...నేనెవర్ని రామూ ...క్షమించటానికి ? ..."

"కాదు సుశీ ... నేను మహాపాపిని ...... నన్ను క్షమించాననవూ ..." అన్నాడు ఎంతోదీనంగా.

"భోజనం చేయవూ...?"

"అక్కర్లేదు సుశీ ... నేను వర్రి దౌర్భాగ్యుణ్ణి ... పాపిని. ఇన్నాళ్ళూ నీ నీడను బ్రతికాను, నీవు చూపే ఆదరాన్నీ, ప్రేమనూ అండగా తీసుకొని,యిన్నాళ్ళూ నిన్నెంతో బాధపెట్టాను...మృగంకన్నా నికృష్టంగా ప్రవర్తిచాను..." అని ఆవేశంగా చెప్పుకుపోయాడు—మళ్లీ ఇలా అన్నాడు.

"నిజంగానే...సుశీ.. నేను దొంగనే. అతని దుకాణంలో దొంగతనం చేసిన మాట నిజమే. నేను నీవనుకొనేటంత నిజాయితీ పరుణ్ణేమీ గాదు ... నా

జీవితంలో నేను నీకేమీ ఇవ్వలేదు... పండుగ నాటికైనా చీరొకటి కొనాలను కొన్నాను ఎన్నో ప్రయత్నాలు చేసాను ఎప్పుడూ దేనికీ నోరుతెరచి అడుగని నేను, ఎంతోమందిని డబ్బడిగాను ప్రచురణాధికారులను కూడ దేవిరించాను. కాని ఫలితం శూన్యం...నేనెంత మోస పోయానో తెల్సుకొన్నాను. నావిలువ నేను తెల్సుకొనగల్గాను నిన్నెంత మోసం చెసానో, కష్టపెట్టానో కూడ తెలుసుకున్నాను. నీకు చీర కొనాలనే కోరిక నానాటికి ఎక్కువవుతూ వచ్చింది. ...నేను అసమర్థుణ్ణి సుశీ...మరొక మార్గంలేక పోయింది అన్నింటికి తెగించాననుకొంటాను ... దొంగతనం చేసాను...పట్టుపడ్డాను. ఆడబ్బుతో ఏది యిచ్చినా నీవు అసహ్యించుకొంటావని దానితో నిన్ను మాలిన్య పర్చకూడదని, అది నీవు కట్టుకొన్నప్పుడు, నేను చేసిన దురంతం, పాపం, నాకు సర్వదాగుర్తు కొస్తూంటుందని—ఆ డబ్బును ఆ రాత్రికి రాత్రే ఖర్చుపెట్టాను, తొక్కరాని గడపలు తొక్కాను. ఎప్పుడూ కలలో గూడ, వెళ్ళగలననుకోని డ్రింకుషాపుల చుట్టూరా తిరిగాను...ఆ తరువాత, నీవు ఆ డబ్బును తీర్చటానికని, ఆ దుకాణంలో పని చేయటానికి చేరినట్లు తెలుసు కొన్నాను. నేనెంతో బాధపడ్డాను. పాపం ఒకరిది, శిక్ష మరొకరికి. నీపై నాకెంతో కోపమొచ్చింది. ఆ తరువాత నీవద్దకు రావాలని ఎంతో ప్రయత్నించాను. చాల సార్లు తలుపు దగ్గరవరకూ వచ్చికూడ వెళ్ళాను. పండుగనాడు దుకాణానికి నీ కోసం వెళ్ళాను. మూసివుంది. ఆ రాత్రి వచ్చి నీ ముఖం చూడబుద్ధి కాలేదు. ఎంతోబాధ పడ్డాను. ఎలా ఏడ్చానో ఎవ్వరికీ తెలియదు. మానవుడు తప్పు చేయకుండా జాగ్రత్త పడితే ఎంత బాగుంటుందో. నాకూవంట్లో బాగోలేదు. మానసికంగా యీబాధ. సాయంకాలమైనా నీతో కలసి యింటికి రావాలని దుకాణానికి వెళ్ళాను. నీకువంట్లో బాగాలేదని దుకాణపుదారు చెప్పాడు...అంతా నావల్లనేగదూ! ... నేను మహాపాపిని ...మనం ఆనాడు కలవకుండా వున్నట్లైతే ...'' అంటూ చిన్నపిల్లడి వలె ఏడ్వటం సాగించాడు.

''పండుగ నాటిరాత్రి వచ్చింది రాము గాదు...! ఎవ్వరతను? ... వెంట దిగ బెట్టటానికొచ్చినతనా ?... పాపిగాని పుణ్యులెవ్వరైనా వున్నారా యీ ప్రపంచంలో?...'' అన్న ఆలోచనలతో మూగదానిలా రాము కన్నీళ్ళు తుడుస్తూ కూర్చుండి పోయాను.

ప్రక్క చర్చి గడియారం రెండు గంటలు కొట్టింది.

